చందు సోంబాబు

## కధనరంగం

# కాష్మోరా ఫార్ములా



కొందరికి చిట్కా వైద్యాలు తెలుస్తాయి. పాము మంత్రం, తేలుమంత్రం వేస్తారు. కానీ ఆ మంత్రాల గురించి ఎవరికీ తెలీనివ్వరు. తెలిస్తే మంత్రం పట్టివ్వదంటారు. అదెంత వరకూ నిజమో కుట్టిన తేలుకి తెలీకపోయినా కుట్టించుకొన్నవాడికి తెలియాలి.

అలాగే ఆరోగ్య సూత్రాల్లో కూడా కొన్ని చిట్కా లుంటాయి. వ్యాయామము చేస్తారు కొందరు. వంటికి వెన్నపూస్తారు ఇంకొందరు. నూనెరాసే వాళ్ళు, నిమ్మరసం రాసే వాళ్ళుంటారు. అవయవాల పొందికల్ని సడలిపోనివ్వకుండా, జారిపోకుండా చాలా మంది ఆడవాళ్ళు కూడా అవస్థపడుతుంటారు. ఆఖరికి కన్నబిడ్డలకి పాలుకూడా ఇవ్వరు కొందరు.

కాత్యాయనికి వెడ్డలవాటుంది. మిగిలిన ఆడవాళ్ళని చూస్తే జెలసీ ఆమెకి. తను కొత్త చింతపండు రంగులో వున్నా అందగత్తెనన్న నమ్మకం ఆమెకి బోలెడంత గలదు.

కాత్యాయనికి తన వాళ్ళు, పరాయివాళ్ళు అన్న తారతమ్యం లేదు. నవ్వుతూ తియ్యగా మాట్లాడుతుంది. అటుతర్వాత వాళ్ళని గురించి ఏకి అవతలకి పడేస్తుంది.

అంచేత ఆమెకి సాధ్యమైనంత దూరంగా వుంటారు ఆడవాళ్ళుసైతం.

కాత్యాయని ఆ రోజు తలంటు స్నానంచేసి జుత్తుని చిక్కుదీసుకుంటూ అద్దంలో చూసుకొని అదిరిపడింది.

ఆమె తల వెంట్రుకలు నెరిసిపోయి కనబడినాయి. తన మొగుడికన్నా తాను చిన్నదే అయినా జుత్తు మెరిసిపోతే మొగుడికి మోజెక్కడ పోతుందోనన్న భయంపట్టుకుంది. ఆమె భర్త అందగాడు. పేరు బోసుబాబు. సుకుమారుడని పేరుంది.

సాధ్యమైనంతవరకూ భర్త కళ్ళకి అందంగా కనబడ్డానికి కాత్యాయని పెదవులకి రంగేసుకుంటుంది. మొహానికి లిక్విడ్ మేకప్ వేసుకుంటుంది. స్లీవ్‌లెస్ జాకెట్లు తొడుక్కుని బొడ్డుకిందకి చీరకట్టుకుంటుంది.

భర్తకి తెలీకుండా బజార్నించి డైయింగ్ స్కిన్ తెచ్చుమని తలవెంట్రుకలకి పూసుకొంది. ఆఫీసులో కూర్చొని పని చేసుకుంటున్నా కూడా ఆమెకి నెరసిపోతున్న వెంట్రుకల గురించి బెంగపెట్టుకుంది.

లంచ అవర్‌లో లాన్‌లో కూర్చుని లంచ్ తీసుకొంటున్నప్పుడు స్వర్ణకి దగ్గరగా జరిగింది కాత్యాయని. తన అవసరం వుంటే కాత్యాయని ఎంత వైలాడితనంగా ప్రవర్తిస్తుందో స్వర్ణకి తెలుసు.

"స్వర్ణ, నిన్నో మాట అడగనా?"

"అడుగు. మాటేగా?" అంది స్వర్ణ నవ్వుతూ.

కొంచెం సందేహించి "మరోలా అనుకోకు. ఆ మధ్యన నీ జుత్తూ నెరిసింది కదా! ఇప్పుడు మామూలుగానే వుంది. డై చేస్తున్నావా?"

"అదేంలేదు. అదే నల్లబడిపోయింది" చెప్పింది స్వర్ణ.

"పోన్లే, నీకు చెప్పడానికిష్టం లేనట్టుంది", నిష్కారణంగా అంది కాత్యాయని. డైచేస్తే జుత్తు పాడైపోతుంది. ఒక్కసారి కళ్ళ జబ్బులుకూడా వస్తాయి. అందుకని నేను ఎప్పుడూ డై చేయలేదు" అంది స్వర్ణ తిరిగి.

"మరి ఏమీ చేయందేనే నల్లగా ఎలా అవుతుంది", ఆశ్చర్యంగా అడిగింది.

"సరే నీకు చెబితే నాకేం నష్టంలేదు. ఆ లక్ష్మీకుమారి దగ్గర ఏదో ఫార్ములా ఏడ్చింది. అదెవరికీ చెప్పదు. గోరింటాకులో ఏదో కలిపిస్తుంది. కుదురులోంచి పుట్టే వెంట్రుకలు కూడా క్రమంగా నల్లబడిపోతాయి. అదే నాకిచ్చింది".

"ఫార్ములా చెప్పలేదూ" ఆశగా అడిగింది.

"ఇలాంటి చిట్కాలని అందరికీ ఎవరూ చెప్పరు".

"లక్ష్మీకుమారి నాకిస్తుందో ఇవ్వదో కాస్తనువ్వడిగి తెచ్చిపెడుదూ!" ప్రాధేయపడింది కాత్యాయని.

"నువ్వే అడుగు. కావాలంటే నేనూ వస్తాను", అంది స్వర్ణ– లక్ష్మీకుమారి వాళ్ళని చూసినవ్వేసి.

"నామొహం, నాకే ఫార్ములా తెలీదు. మా నానమ్మ చేస్తుంది. ఆవిడ ఎవరికీ చెప్పదు".

"నా కోసం... ఫార్ములా వద్దులే. కాస్త అదేదో చేయించి తెచ్చిపెట్టు" అడిగింది.

"అలాగే", అంది ముక్తసరిగా లక్ష్మీకుమారి.

రెండోరోజు కాత్యాయనికి చేసేసి తీసుకొచ్చి ఇచ్చింది లక్ష్మీకుమారి.

అంతే! పది రోజుల్లో కాత్యాయని జుత్తు ముగ్గుబుట్ట అయిపోయింది.

కాత్యాయని లబోదిబోమంటూ లక్ష్మీ వారి దగ్గరికి పరుగెత్తుకొచ్చింది.

"సారీనే, మా నానమ్మ నాల్రోజుల క్రితం చనిపోయింది. నిన్ను చూస్తే నాకెంతో జాలిగావుంది", అంది లక్ష్మీకుమారి.

కాత్యాయని కళ్ళనీళ్ళు పెట్టుకొని వెళ్ళిపోతుంటే స్వర్ణ అడిగింది.

"ఏం జరిగిందే", అని.

"అంతా కాష్మోరా మహిమ", అంటూ నవ్వేసింది లక్ష్మీకుమారి.

"సరిగ్గా చెప్పితగలడు".

"అది నన్ను బిచ్ అని నోటికొచ్చినట్టు వాగింది. దానికి తగిన శిక్షవేశాను. ఆ ఫార్ములాలో తేనె కలిపాను. తేనె రాస్తే జుత్తు తెల్లబడిపోతుంది", అంది లక్ష్మీకుమారి.

స్వర్ణ ఆమె మాటలు విని విస్తుబోయింది.